# కొండా కోనల్లో

జాలా నటరాజు

అది నాలుగు కొండల మధ్యనున్న అతి సుందరమైన గిరిజన ప్రాంతం. కొందరు గిరిజనులు సుమారు రెండువందల మంది వరకూ అక్కడ ఇళ్ళు కట్టుకొని జీవనాన్ని సాగిస్తున్నారు. ఆ గూడేనికి ప్రక్కగా ఒక అందమైన సెలయేరు ప్రవహిస్తూ వున్నది. చుట్టూ పచ్చని పొలాలు ప్రకృతి మాత తన అందాన్నంతా ఇక్కడే ఏర్చి కూర్చినట్టున్న ఆ ప్రదేశాన్ని చూడటానికి నిత్యం టూరిస్టులు వచ్చి వెళుతుంటారు. దూరప్రాంతాల నుండి విద్యార్థులు కూడా విహారయాత్రల పేరిట ఇక్కడకు వచ్చి ప్రకృతి అందాలను చూసి ఆనందిస్తూ వుంటారు.



ఒకరోజు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలపై అధ్యయనం చేస్తున్న ఒక ప్రొఫెసరు గారు తనకు బాగా పరిచయం వున్న గిరిజన అభివృద్ధిశాఖకు చెందిన అధికారి వద్దకు వచ్చి ఆ ప్రాంత ప్రజల జీవన విధానాలను అధ్యయనం చెయ్యాలని వుంది అని చెప్పడంతో ఆ ప్రొఫెసర్‌గార్ని తీసుకొని గిరిజనాభివృద్ధి శాఖాధికారి గారు ఆ గూడేనికి వచ్చారు.

ఆ ప్రాంత ప్రజలతో ఇంటర్వ్యూలు అయిన తర్వాత గిరిజనాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఒక చిన్న ఉద్యోగి సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశాడు. అది ఒక గిరిజన నృత్యం, నృత్యానికి అనువుగా గుండ్రని ప్రదేశాన్ని ఏర్పాటు చేశారు. గూడెంలోని వారందరూ నృత్యాన్ని తిలకించడానికి ఆ ప్రదేశం చుట్టూ వచ్చి కూర్చున్నారు. నృత్యంల్లో పాల్గొనేవారందరూ బిలబిలమంటూ వచ్చి అక్కడకు చేరారు. వారంతా పూర్తిగా ఆటవిక జాతులు ధరించే దుస్తులు ధరించి వున్నారు. మెడ నిండా పూసల దండలు, మొలకు జంతు చర్మాలను పోలిన దుస్తులను వేసుకొని చాలా హుషారుగా వున్నారు. అతిథులిద్దరూ ప్రశంసిస్తున్నట్లుగా చిన్న ఉద్యోగి వైపు చూశారు. ఆ చిన్న ఉద్యోగి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు. నృత్యం మొదలుపెట్టారు.

పెద్దపెద్ద శబ్దాలతో చెవులు చిల్లులు పడేలా డప్పులు మోగిస్తున్నారు. రంకెలు వేస్తున్నట్లుగా నృత్యం చేస్తున్నారు. ఆడవాళ్ళను మగవాళ్ళు చేతులతో పైకెత్తుతున్నారు. మగవాళ్ళు వంగితే ఆడవాళ్ళు వాళ్ళ భుజాలమీదకెక్కి కూర్చుంటున్నారు. అరుపులు.. కేకలు.

అసలు వారేం పాడుతున్నారో అర్థం కావడం లేదు. మరో విధంగా చెప్పాలంటే వినిపించడం లేదు కూడా. మధ్యలో ఈలలు, కేకలు వేస్తున్నారు. కాస్సేపటికి నృత్యం ముగిసింది. అతిథులిద్దరి ముఖాలూ కోపంతో ఎర్రబడ్డాయి. చివ్వున లేచి జీపు వైపు నడుచుకుంటూ వెళ్ళిపోయారు. చీకటిపడిన తరువాత ఆ చిన్న ఉద్యోగిని గెస్ట్ హౌస్‌కి పిలిపించారు. భయం భయంగా లోనికి ప్రవేశించాడు ఆ చిన్న ఉద్యోగి.

"ఏందయ్యా అది గిరిజన నృత్యమా? సాంప్రదాయ నృత్యమా?

"అవును సార్" నసిగాడు చిన్న ఉద్యోగి.

"ఎవడు చెప్పాడు నీకు?" మండిపడ్డాడు ఆఫీసరుగారు.

"ఆ గూడెం పెద్ద సార్. నెల రోజులు ప్రాక్టీసు కూడా చేశారట సార్" నాదేమీ తప్పు లేదన్నట్టుగా చెప్పాడు చిన్న ఉద్యోగి.

"ప్రాక్టీసు చేశారా?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రొఫెసర్.

"ప్రాక్టీసు చెయ్యడమేమిటయ్యా నీ బొంద. వాళ్ళకి బాల్యం నుండే ఆడ మగ అందరూ నేర్చుకొని వుంటారు. ఒకళ్ళ నడుముపై ఒకరు చేతులు వేసుకొని జట్లు జట్లుగా ముందుకు ఒక అడుగు, వెనక్కి ఒక అడుగు వేసుకుంటూ చక్కగా నృత్యం చేస్తారు. మరి ఇదేమిటి చాలా విడ్డూరంగా వుంది. ఏదీ ఆ గూడెం పెద్దను పిలిపించు ఒకసారి" అన్నాడు ఆఫీసరుగారు.

ఆ గూడెం పెద్దను వెంటబెట్టుకొని వచ్చాడు ఆ చిన్న ఉద్యోగి.

"నీ పేరేమిటయ్యా?"

**దృష్టి**



**మధ్యతరగతి కుటుంబం**
**అనుబంధాలూ అనుభూతులూ**
**ఉల్లిపాయ పొరలు!**
**హైక్లాసు ఫ్యామిలీ**
**హైటెక్ ఎక్స్‌పీరియన్సెస్**
**కంప్యూటర్ చిప్స్!**
**నిరుపేద బ్రతుకులు**
**కాయకష్టాలు**
**ఉప్పు స్పటికాలు!**

**- గుడిమెట్ల గోపాలకృష్ణ**

"రామన్న దొర. ఈ గూడేనికి పెద్దను దొరా" వినయంగా చెప్పాడు తక్కువ ధరకు కొన్న జీన్స్ షర్టు, పువ్వుల లుంగీ భుజంపై తువ్వాలు వేసుకున్నాడు. మీసాలు, గడ్డం పూర్తిగా తీసేశాడు. ఎర్రగా హిందీ సినిమాలో క్యారెక్టర్ యాక్టర్‌లా వున్నాడు.

"మంచిది. మీ నృత్యం చూశాము. ఏమిటీ అంతా కొత్తగా వుంది" అడిగాడు ఆఫీసరు గారు.

"అవును దొరా"

"కొంచెం అసభ్యంగా కూడా వుంది. అసలు మీ నృత్యంలాగా లేదు. అదీకాక మీరు నెలరోజులపాటు ప్రాక్టీసు చేశారని కూడా చెప్పాడు" ఆశ్చర్యంగా అడిగారు ప్రొఫెసరు గారు.

"అవును దొరా ఆ గెడ్డపాయన కూడా ఇది మా ఆటే అని చెప్పిండు"

"గెడ్డపాయనా? ఆయనెవరు?" మరింత ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు ఆఫీసరుగారు.

"అసలేం జరిగినాదంటే దొరా" అంటూ భుజం మీద తువ్వాలు తీసి గచ్చు దులిపి సోఫా పక్కన కూర్చుంటూ చెప్పసాగాడు.

"వద్దు వద్దు ఇలా వచ్చి బల్లమీద కూర్చో" అంటూ రామన్న దొర బల్లమీద కూర్చున్న తరువాత "ఇప్పుడు చెప్పు ఏం జరిగింది?" అన్నాడు ఆఫీసరుగారు.

ఒక రోజు ఒక పెద్ద సినిమా డైరెక్టరుగారికి ఆ గూడెం ప్రాంతంలో సినిమా తియ్యాలనిపించి తన బృందంతో అక్కడకు చేరుకున్నారు.

ఆ చుట్టుపక్కల కొన్ని దృశ్యాలు చిత్రీకరించిన తరువాత హీరో హీరోయిన్‌పై ఒక ఫోక్ డాన్సు తీయడానికని గూడెంలోకి వచ్చారు.

గూడెం పెద్ద రామన్న దొరని పిలిపించారు.

"దొరా మీ గూడెంలో ఒక డాన్సు తీస్తున్నాము. ఇదిగో ఈ బట్టలు మీ వాళ్ళకు కొందరికి ఇచ్చి ఇవి వేసుకొని ఆ స్థలం చుట్టూ కూర్చోమని చెప్పు" అంటూ కొన్ని కాస్ట్యూమ్స్ తీసి రామన్నదొర చేతికందించాడు.

ఆశ్చర్యంగా ఆ దుస్తుల వైపు చూస్తూ "అట్టాగే దొరా" అంటూ తీసుకొని గూడెంలోని వాళ్ళకు ఇచ్చాడు.

కొందరు ఆ బట్టలు వేసుకొని అ స్థలం చుట్టూ కూర్చున్నారు. అంతలో రెండు బస్సుల్లో సుమారు యాభైమంది వచ్చి అక్కడ దిగారు. వచ్చీ రాగానే బిలబిలమంటూ జనం మధ్యలో నిల్చున్నారు. వారంతా జుట్టు ముడులు వేసుకొని తలలో పక్షి ఈకలు గుచ్చుకొని పులి చర్మాన్ని దుప్పి చర్మాన్ని పోలివున్న రంగు రంగుల దుస్తులు కట్టుకొని వున్నారు. ఆడా మగా అందరూ మెడలో పూసల దండలు వేసుకున్నారు.

కొంచెం సేపటికి టేపురికార్డర్‌లో పాట మొదలయ్యింది. వారికి నృత్యం ఎలా చెయ్యాలో ఇద్దరు చేసి చూపిస్తున్నారు. గెడ్డపాయన... అదే ఆ సినిమా డైరెక్టరుగారు కెమెరా పక్కన నిల్చుని మైకు పట్టుకొని

ఆదేశాలిస్తున్నారు. రామన్న దొర నెమ్మదిగా ఆ గెడ్డపాయన దగ్గరకు చేరాడు.

"ఇది ఏమి ఆట దొరా?" అమాయకంగా ప్రశ్నించాడు.

"ఇది మీ డాన్సే దొరా" ఆ మాత్రం తెలీదా అన్నట్టు అన్నాడు డైరెక్టరుగారు.

"మా ఆటనా.. నాకెరికలేద్దొరా.." ఆశ్చర్యంగా అన్నాడు పెద్ద.

"ఇది మీ వాళ్ళు చేసే నృత్యమే దొరా. ఈ డాన్సుని మా గురువుగారి గురువుగారు ఆయన తీసిన సిన్మాలో పెట్టారు. ఆ సినిమా నూటయాభై రోజులు ఆడింది. ఆ రోజుల్లో అందరి నోటా ఆ సినిమా పాటే" వివరించాడు డైరెక్టరుగారు. అర్థంకాక బుర్ర గోక్కున్నాడు రామన్న దొర.

"ఆ బట్టలేంది దొరా అట్టాగున్నాయ్?" మళ్ళీ ప్రశ్నించాడు రామన్న దొర.

"మీ వాళ్ళు పులి చర్మాలు, లేడి చర్మాలు కట్టుకొని జుట్టు ముడి వేసుకొని ముడిలో పక్షి ఈకలు గుచ్చుకుంటారు కదా! అందుకే నేచురాలిటీ కోసం ఆ దుస్తులు వేయించాను బాగుందా?" అడిగారు గెడ్డపాయన ఎంతో మురిసిపోతూ.

"నా తాత ముత్తాతల నుండి సూస్తున్నా దొరా అసుమంటి బట్టలేనాడూ కట్టుకోలేద్దొరా మా వాళ్ళు" అయోమయంగా చూస్తూ అన్నాడు రామన్న దొర.

"సరే యిది కూడా నిజం కాదులే. మా హీరోకి వచ్చిన డ్రీమ్ సీను అన్నమాట" అన్నారు డైరెక్టరుగారు వురఫ్ గెడ్డపాయన అర్థంకాక మరోసారి బుర్ర గోక్కున్నాడు రామన్న దొర.

డాన్సు పూర్తి అయింది. అందరూ చప్పట్లు కొట్టారు ఆనందంతో. ఆలోచిస్తూ కూర్చున్న రామన్న దొర దగ్గరకు చేరారు ఆ గూడెం ప్రజలు.

"దొరా ఆట సానా బాగుంది దొరా.. మనవూ అట్టాంటి ఆటగట్టాలె పట్నంలో సదూకొంటున్న మన పోరగాళ్ళు సూసిన్రంటే భలే సంబరపడతారు దొరా" అన్నారు సంతోషంగా.

"ఏందిరా అంతగా నచ్చినాదిరా ఆ ఆట మీకు?" ఆశ్చర్యపోతూ అడిగాడు రామన్న దొర.

"దొరా"

ఏమిటన్నట్టు చూశాడు డైరెక్టరుగారు రామన్న దొర వైపు.

"ఆట చాలా బాగుంది దొరా. మా వాళ్ళందరికీ నచ్చింది" అందరి తరపునా మెచ్చుకున్నాడు రామన్న దొర.

"అలాగా వెరీ గుడ్" అన్నాడు డైరెక్టరు గారు.

"వీళ్ళకే ఇంతగా నచ్చితే ఆంధ్ర ప్రేక్షకులు ఎగిరి గంతేస్తారు ఈ సీను చూసి"

డైరెక్టరుగారు మనసులోనే ఉబ్బితబ్బిబ్బు అయ్యాడు.

"దొరా మా గూడెపోళ్ళు ఈ ఆట నేర్చుకుంటారట దొరా"

"అలాగా" అని కొంచెంసేపు ఆలోచించి "సరే మేము ఈ ప్రాంతంలో మరో నాలుగు రోజులుంటాము. అలాగే నేర్చుకుందురుగాని" అంటూ "కరీంభాయ్" అని పిల్చాడు డైరెక్టరు గారు.

డాన్సు డైరెక్టరు "సార్" అంటూ వచ్చాడు.

"చూడు భాయ్ వీళ్ళు ఆ డాన్స్ స్టెప్స్ నేర్చుకుంటారట. మనమెలాగూ నాలుగు రోజులు యిక్కడే వుందామనుకొంటున్నాము కదా! సాయంత్రం సమయంలో మీ అసిస్టెంటుకి చెప్పి వీళ్ళకు ఆ స్టెప్స్ నేర్పించమనండి" అంటూ రామన్న దొరవైపు తిరిగాడు గెడ్డపాయన.

"సరేనా దొరా" అంటూ భుజం మీద చేయి వేస్తూ అడిగాడు.

"సానా సంతోషం దొరా" అన్నాడు రామన్న దొర. యువకులు అందరూ ఆనందంతో చప్పట్లు కొట్టి ఈలలు వేశారు.

"ఇదీ జరిగిన సంగతి దొరా ఆకాడ్నించి మాసం రోజులుదాకా మా వాళ్ళు ఈ ఆట నేర్చుకుంటున్నారు దొరా.

"ఓరినీ అసాధ్యం కూలా. అది తప్పుడు డాన్సు దొరా. సినిమావాళ్ళు డబ్బుల కోసం అలాంటి వెర్రి మొర్రి వేషాలు వేయిస్తుంటారు. అది కాస్తా మీరు నమ్మేసి అదే మీ నృత్యం అనుకున్నారు అవునా?" అడిగాడు ఆఫీసరు గారు.

"అవును దొరా"

"చూడు రామన్న దొరా మీ సాంప్రదాయక నృత్యం చాలా బాగుంటుంది. అలాంటి నృత్యాన్ని కాదని యిలా సినిమా డాన్సులు నేర్చుకుంటే మీ గిరిజన సంస్కృతే దెబ్బ తింటుంది. మీ వాళ్ళకు నచ్చజెప్పు. అలాంటి అసభ్యకరమైన నృత్యాలు నేర్చుకోవద్దని" అంటూ చిన్న ఉద్యోగి వైపు చూశాడు ఆఫీసరు గారు.

"సార్" అంటూ దగ్గరకు వచ్చాడు చిన్న ఉద్యోగి.

"వీళ్ళకు అర్థమయ్యేలా నువ్వు కూడా వివరించి చెప్పు తెలిసిందా?"

"అలాగే సార్" అంటూ తల గిరగిరా తిప్పాడు చిన్న ఉద్యోగి.

ఈనాడు వెర్రితలలు వేస్తున్న నాగరికత అమాయక ప్రజల జీవన విధానంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో బాగా అర్థం చేసుకున్న ప్రొఫెసరుగారు నిరాశగా వెనుతిరిగారు. ❋

